క్లుప్తంగా

10 నుంచి 13 వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులు

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంపిక చేసిన సచివాలయాలల్లో ఆధార్‌సర్వీసు అందుబాటులోకి తెచ్చినట్లు మున్సిపల్‌కమీషనరు సుభాస్‌చంద్రబోస్ తెలిపారు. ఈనెల 10వతేదీనుంచి 13వ తేదీ వరకు ఓబయ్యకాలనీలోని సచివాలయంలో ఆధార్‌లో మార్పులు, చేర్పులు, నూతన కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రీ వెరిఫికేషన్‌లో గుడ్‌షెపర్డ్ విద్యార్థినికి టౌన్

రీ వెరిఫికేషన్‌లో బొత్ససింధు టౌన్‌ఫస్ట్



వినుకొండ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తాజాగా వెరిఫికేషన్ అనంతరం స్థానిక షెఫర్డ్ ఉన్నత పాఠశాలకు చెందిన బొత్ససింధు అనే విద్యార్థిని 600 మార్కులకుగాను 595 మార్కులు సాధించి టౌన్‌ఫస్ట్ సాధించినట్లు స్కూల్ డైరెక్టరు డాక్టర్ జి.ఇన్నారెడ్డి తెలిపారు.ఈ నెల 6వ తేదీన రీవెరిఫికేషన్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుతో కలసి అభినందనలు తెలియజేశారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి విలువలతో కూడిన విద్యను బోధిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపి మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7,8,9 తరగతులలో ఉన్న అతికొద్ది సీట్లు భర్తీ నిమిత్తం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులకు ఈ నెల 24న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశమును ఆయా తరగతుల విద్యార్థులు సద్వినియోగము చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

నరసరావుపేట రూరల్: వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం రైతులకు వ్యవసాయ యంత్ర పనిముట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, ఏడీఏ పి.మస్తానమ్మ, రొంపిచర్ల ఏవో శివలలిత, ఏఈవో బ్రహ్మయ్య, వీఏఏలు బోసు, వినయ్‌కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికలకు క్రీడలపై అవగాహన ర్యాలీ



యడ్లపాడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ అన్నారు. శుక్రవారం కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని ఎంపీపీ ఝాన్సీ సాగర్, ఎంపీడీవో వి.హేమలతాదేవి బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతల సహకారం అభినందనీయమని వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో వైద్యాదికారి మాట్లాడుతూ శావల్యాపురం గ్రామానికి చెందిన మంచికలపూడి రామకృష్ణ మంచికలపూడి మారుతి (అమ్మ) కుటుంబ సభ్యులు ప్రవాస భారతీయులు యామిని లక్ష్మీదుర్గా, షాలిని,ధనుష్, రూ.35 వేల విలువ చేసే కుర్చీలు, థియేటరులో వినియోగించే స్టీలు డస్కు పరికరం వితరణ చేసినట్లు తెలిపారు.

పోషకాలతో వంటకాలు వండాలి

శావల్యాపురం: మధ్యాహ్న భోజన నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే వారందరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

వివాదాస్పద నిర్మాణ స్థల పరిశీలన



అనుమతులు లేని నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖాధికారులు



అడ్డుగా ఉందని తొలిగించిన నాడునేడు మరుగుదొడ్లు (పాత చిత్రం)

- పాఠశాలలో దేవాలయ నిర్మాణంపై అధికారుల ఆరా
- అనుమతులు లేకుండా కట్టడాలు వద్దంటూ హితవు

నూజెండ్ల:మండలంలోని కొత్తకొత్తపాలెం హరిజనవాడ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వివాదాస్పదంగా చేపడుతున్న గుడి నిర్మాణ స్థలాన్ని శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు సాంబశివరావు, రవిచంద్ర పరిశీలించారు. చుట్టు ప్రక్కల వారిని పిలిపించి మాట్లాడారు. అనుమతులు లేకుండా పాఠశాల ఆవరణలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని కాలనీవాసులకు తెలిపారు. పనులు ఆపాలని లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంకా బిల్లులు కూడా చెల్లింపులు జరగని మరుగుదొడ్లను ఎలా తొలగించారని ఎంఇవో సాంబశివరావు స్థానికులను ప్రశ్నించారు. మండల పరిషత్ అధికారి దృష్టికి తీసుకెళ్లామని వారి అనుమతులతో పనులు చేస్తున్నామని, నిర్మాణ పనులు ఆపే ప్రసక్తే లేదని గ్రామస్తులు తేల్చి చెప్పారు. అనుమతి పత్రాలు ఉన్నాయా అని అడిగితే లేవని బదులిచ్చారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు. జిల్లా ఉన్నతాధికారులకు ఈ సమస్యను తెలియజేస్తామని ఎంఇవోలు తెలిపారు. స్థానిక పోలీసు అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నుంచి ఫిర్యాదు తీసుకోకుండా కాలం వెళ్లదీస్తున్నారన్నారు.



స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీ

కాలనీవాసుల అభ్యంతరం

ఇదిలా ఉండగా కాలనీవాసులు మాట్లాడుతూ గుడి నిర్మాణం వల్ల పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందన్నారు. ఒకే ఆవరణలో ఉండటం వలన విద్యాభ్యాసం కొనసాగించటం సాధ్యమా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గుడి నిర్మాణానికి అభ్యంతరం లేదని వేరే ప్రాంతంలో చేపడితే అందరూ సహకరిస్తామన్నారు. గుడి పూర్తయితే పాఠశాల మూతపడటం ఖాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి తీరిక దొరికినప్పుడే సమావేశం పెట్టండి!



మాట్లాడుతున్న ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ పక్కన ఎంపీడీవో హేమలతాదేవి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై సభ్యుల మండిపాటు
- అధికారులు ప్రజాప్రతినిధుల్ని సమన్వయం చేసుకోవాలని ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ సూచన

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగింది. ప్రజాప్రతినిధులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, ''గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. లేకపోతే పథకాల అమలే ప్రశ్నార్థకమవుతుంది అని ఆమె హెచ్చరించారు.

అధికారుల గైర్హాజరుపై ప్రశ్నల వర్షం

సొలస ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో స్పందిస్తూ, మూడు నెలలకు ఒక్కసారి సమావేశం పెట్టినా అధికారులు రావడం లేదు. వారికి ఖాళీ ఉన్నప్పుడే సమావేశాలు పెట్టండని, పనులు మానుకుని వచ్చి మేమేం చేయాలో చెప్పండని ప్రశ్నించారు. ఇది ప్రజాప్రతినిధుల పరువు తీయడమే కదా?'' అని నిలదీశారు. ఇటీవల జరిగిన గ్రీవెన్స్‌లో రెవెన్యూ భూముల సమస్యపై వినతి ఇస్తే దానిని ఎండోమెంట్‌శాఖకు బదిలీ చేస్తే ఆ సమస్య ఎలా పరిష్కారం అవుతుందని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన ఆయన, ''ప్రజా సమస్యల్ని చెప్పుకోవడానికి సంబంధిత అధికారులే లేకపోతే, అర్థం లేని సమావేశాలే మిగులుతాయి. గౌరవ వేతనం లేదు, అధికారుల వద్ద మాకు గౌరవం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తవారిపాలెం సర్పంచ్ మాట్లాడుతూ, ''ఉపాధి పనులపై సర్పంచ్ అంగీకారం లేకుండానే పనులు ఆమోదించడమేంటీ? ఇదేనా ప్రజా ప్రతినిధుల విలువ?'' అని తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఏపీవో డి.సుందరరావు, గ్రామ సభలలో ఆమోదించిన పనులనే చేపడుతున్నాం. కొత్తగా ఎలాంటి పనులు ఆమోదించలేదని సమాధానం ఇచ్చారు.

వాట్సాప్‌లో పెట్టాం అంటే సరికాదు : ఎంపీటీసీ కీర్తి అరుణ్ కుమార్

శాఖల సమాచారం వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాం, సచివాలయ సిబ్బందికి ఇచ్చాం. పార్టీ లీడర్లకు చెప్పాం అనటం సరిపోదు. ప్రజాప్రతినిధులకు నేరుగా సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యతని ఎంపీటీసీ కీర్తి అరుణ్ కుమార్ స్పష్టంగా పేర్కొన్నారు. అధికారులపై పర్యవేక్షణను మరింత కఠినతరం చేయాలని, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పట్టించుకోని విధానం భవిష్యత్‌లో సహించబోమంటూ పలువురు సభ్యులు హెచ్చరించారు. అవసరమైతే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎంపీపీ సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి తదుపరి సమావేశంకు విధిగా హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవోకు సూచించారు.

ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే సమావేశం నుంచి అన్ని శాఖలకు చెందిన ముఖ్య అధికారులు విధిగా హాజరయ్యేలా చూస్తామని, ప్రజాప్రతినిధులు సమావేశంలో చెప్పిన అంశాలను వారికి తెలియజేస్తానంటూ సమాధానమిచ్చారు. ముందుగా వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ్, హౌసింగ్ ఏఈ షేక్ జానీబాష, ఉపాధి పథకం ఏఈ డి.సుందరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ, ఆర్ఐ ఎం.సుబ్బారావు, ఏఈవో ప్రతాప్ తదితరులు తమ శాఖల పనితీరును వివరించారు.

పి-4 సర్వేతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

నూజెండ్ల: ప్రభుత్వం చేపడుతున్న పి-4 సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పారా లక్ష్మయ్య అన్నారు. మండలంలోని భూమాయిపాలెం గ్రామంలో శుక్రవారం గుండ్లకమ్మ గ్రామోద్యమ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులుతో కలిసి యూపీఎస్సీ సివిల్స్ విద్యార్థులు పర్యటించి వివరాలు సేకరించారు. ప్రజల ఆర్థిక స్థితిగతులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పారా లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే పథకాలకు నిజమైన లబ్ధిదారుల ఎంపిక జరగాలంటే పి-4 సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు.

గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల వారికి మెరుగైన జీవనోపాదులు కల్పించి వారి ఆదాయం రెట్టింపు అయ్యేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలు, విశ్రాంత ఉపాధ్యాయులు భాగవతుల రవికుమార్ ఉన్నారు.



సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సివిల్స్ విద్యార్థులు

ఓఎన్‌జీసీ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

నాదెండ్ల: భారతీయ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఓఎన్‌జీసీ అధికారులకు శుక్రవారం చుక్కెదురైంది. మండలంలోని గొరిజవోలు గ్రామంలో గత రెండు మూడు రోజులుగా ఓఎన్‌జీసీ సంస్థ అధికారులు పొలాల్లో బోర్లు వేస్తున్నారు. సుమారు 70 అడుగుల లోతు బోరు వేసి పూడ్చకుండా వదిలేస్తున్నారు. దీనిపై గ్రామానికి చెందిన కారసాల శంకర రెడ్డి మరికొంతమంది రైతులు ఓఎన్‌జీసీ అధికారులను నిలదీశారు. తమ పొలాల్లో బోర్లు వేసే హక్కు మీకెక్కడిదంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం అనుమతి ఉంటే ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. దీంతో వారు సమాధానం చెప్పలేక అక్కడి నుండి వెనుదిరగాల్సి వచ్చింది. గత రెండు నెలలుగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఓఎన్‌జీసీ అధికారులు రైతుల అనుమతులు లేకుండానే బోర్లు వేశారు. ఈ బోర్లు ఎందుకు వేస్తున్నారనే విషయాన్ని రైతులకు చెప్పకపోవటమే కాక, వేసిన బోర్లను పూడ్చకపోవటంపై రైతులు మండిపడుతున్నారు.



గొరిజవోలులో ఓ రైతు పొలంలో బోరు వేస్తున్న సిబ్బంది

వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో ఉపకరించాయి




నాదెండ్ల: వేసవి విజ్ఞాన శిబిరాలు చిన్నారులకు ఎంతగానో ఉపకరించాయని లైబ్రేరియన్ ఆర్ శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఏప్రియల్ 28 నుండి శుక్రవారం వరకూ 50 రోజుల పాటూ జరిగిన విజ్ఞాన శిబిరాల్లో చిన్నారులు అనేక విషయాలు నేర్చుకున్నారు. చదవటం, రాయటం, డ్రాయింగ్, క్విజ్, వక్తృత్వం, కథలు వంటి అనేక విషయాల్లో ప్రావీణ్యం పొందారు. పలు పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందించారు.

ముగిసిన శిక్షణ శిబిరాలు

శావల్యాపురం: స్థానిక గ్రంథాలయంలో గత 40 రోజుల నుంచి నిర్వహించుతున్న వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల్లో ఉన్నటువంటి సృజనాత్మకతను వెలిగితీయటానికి ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు దూరంగా ఉండాలని సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరానికి మించి వాడరాదన్నారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్య కల్గియుంటారన్నారు. చిత్రలేఖనం,వ్యాసరచన.తదితర వాటిల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కె.శ్రీనివాససింగ్, ఎల్.చెన్నుబాబు, సైదావలి, ఎస్.వీరాంజనేయులు, చెవల శ్రీరాములు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి డొంకవద్ద వేంచేసి ఉన్న శ్రీ సంజీవ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషమైన అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా నిర్వహించారు. రాత్రికి భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నారాయణ రామకృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో పలువురు రుత్విక్‌లు పాల్గొని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రెడ్డిపాలెం, కొత్తపల్లి, కుంకలగుంట తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్



కుక్కలకు కుటుంబనియంత్రణ చేస్తున్న సిబ్బంది

వినుకొండ: పట్టణంలో వీధికుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు ఐదవవిడత డ్రైవ్ ప్రారంభమైనట్లు మున్సిపల్‌కమీషనరు సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలు స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో 155 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు యాంటి రేబిస్ ఇంజక్షన్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సాగర్, లక్ష్మయ్య, నాగరాజు, దావీదు, తదితరులుపాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న షేక్ రఫాని, అంజుమన్ కమిటీ సభ్యులు

చిలకలూరిపేట: బక్రీద్ ప్రార్థనలకు అడ్డరోడ్డు సెంటర్‌లోని ఈద్గా మైదానం సిద్ధమైంది. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి శుభ్రపరిచారు. పనులను మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, అంజుమన్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. శనివారం ఉదయం 7 గంటలకు బక్రీద్ సందేశాన్ని ముఫ్తీ ఖలీల్‌ఖాన్ ఇస్తారని, 8 గంటలకు నమాజును ముఫ్తీ అనస్ ఖాన్ నిర్వహింప చేస్తారని అంజుమన్ ఇస్లామియా కార్యదర్శి షేక్ అహ్మద్ తెలిపారు. అడ్డరోడ్డు సెంటర్‌లో ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనలను పురస్కరించుకొని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లను పట్టణ పోలీసులు చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి బక్రీదు ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్‌ను వేరే మార్గాలకు మళ్లిస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు



మొండితోక రాణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల: ప్రజలకు బాధ్యతాయుతమైన సేవా చేసినప్పుడే చేపట్టిన పదవులకు న్యాయం చేకూరుతుందని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో శుక్రవారం యార్డ్ చైర్మన్‌గా మొండితోక రాణి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఛైర్మన్, డైరెక్టర్లు నిత్యం రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రాణికి శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ నాయకులు, యార్డ్ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ నాయకులు పులిమి రామిరెడ్డి, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మండల నాయకులు నెల్లూరి శ్రీనివాసరావు, పెద్దినీడి సుబ్బారావు, ఇంటూరి వెంకటరావు పాల్గొన్నారు.

ముగిసిన సోమేశ్వర దేవాలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూల విరాట్



పూజల్లో పాల్గొన్న దంపతులు

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవాలయం 8వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిసినట్లు ఆలయ పూజారి సౌభాగ్యశర్మ తెలిపారు. ఈనెల 4 నుంచి ప్రారంభం కాగా చివరిరోజు దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేదమంత్రాల నడుమ దంపతులచే శాంతి కల్యాణం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం ప్రదర్శన కార్యక్రమం అందరు తిలకించారు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రముఖ వ్యాపారవేత్త సత్యసీడ్స్ అధినేత కొసనా రామకోటేశ్వరరావు- ధర్మపత్నీ కృష్ణకుమారి దంపతులచే స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్ విగ్రహాన్ని పూల మాలలు వెండితోరణాతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఈకార్యక్రమంలో పోతుల శ్రీనివాసరావు, చెన్నంశెట్టి నాగేశ్వరరావు, మన్నం వెంకటేశ్వర్లు, పోతుల నరసింహారావు, శేషాద్రి, కర్ణా వెంకటేశ్వర్లు, కొనకంచి వెంకటరావు, మలిశెట్టి నరేష్, రావి సుబ్బారావు, గోపాలం సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో సులభంగా సోలార్ విద్యుత్

- వినియోగదారులకు సూచించిన ఎస్.ఇ విజయకుమార్
- డీ2సెక్షన్‌లో దాడులు చేసి రూ.3.68 లక్షల అపరాధ రుసుం విధింపు



మాట్లాడుతున్న సీహెచ్.వెంకటేశ్వరరావు, విజయకుమార్

నరసరావుపేట: విద్యుత్ వినియోగదారులు అందరూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని సబ్సిడీపై తమ గృహాలు, వాణిజ్య సముదాయాలకు సోలార్ పవర్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీరు డాక్టర్ పి.విజయకుమార్ కోరారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సూరఘర్ వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలను గురించి వివరాలను వెల్లడించారు. మూడు కిలోవాట్‌ల ఫలకాలు బిగించుకుంటే రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుందని, రెండు కిలోవాట్‌ల ఫలకాలకు రూ.60 వేలు, ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. వినియోగదారులకు కావాల్సిన బ్యాంకు రుణం, అనుకూలమైన సోలార్ ఫలకాలు వారే నిర్ణయించుకోవచ్చన్నారు. ఒక కిలోవాట్‌కు రోజుకు 4.5 యూనిట్లు చొప్పున నెలకు 135 యూనిట్ల వరకు, మూడు కిలోవాట్‌ల ఫలకాలకు 375 ఉత్పత్తి జరుగుతుందన్నారు. వీటిలో వినియోగదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను నూతనంగా ఏర్పాటుచేసిన స్మార్టు మీటరు ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేయటం జరుగుతుందన్నారు. ఈ విధంగా గ్రిడ్‌కు వినియోగదారుల నుంచి వచ్చిన విద్యుత్‌కు ఆర్నెల్లుకు ఒకసారి సెటిల్ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు.

3219 సర్వీసులు తనిఖీచేసి రూ.3.68 లక్షల అపరాధ రుసుం విధింపు

అలాగే శుక్రవారం పట్టణంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల అధికారులు 3219 సర్వీసులు తనిఖీ చేసి రూ.3.68 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సీహెచ్ రాంబొట్లు, సీహెచ్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 135 మంది అధికారులు, సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీల్లో పాల్గొన్నారన్నారు. అనుమతించిన లోడుకంటే అధికంగా విద్యుత్ ఉపయోగించుకున్న 68 మందికి రూ.3,60,800లు అనుమతించిన కేటగిరీల కంటే ఇతర కేటగిరీల విద్యుత్ వాడుకున్న ముగ్గురికి రూ.8 వేలు అపరాధ రుసుం విధించటం జరిగిందన్నారు. దాడుల్లో డీపీఇ విభాగానికి చెందిన ఏడీఎం ఎస్‌వీ ప్రసాదు, టౌన్ ఆపరేషన్ డీఇఇ జీఎస్‌వి ప్రసాదు, డీ2 ఏఇ నాగసురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శుక్రవారం తెలిపారు. ప్రకాష్ నగర్‌కు చెందిన సూరేపల్లి కృష్ణ సెయింటాన్స్ స్కూల్ సమీపంలో నడిచి వెళ్తుండగా ఆటో ఢీకొంది. సంఘటనలో కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.